ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
28 ఫిబ్రవరి
2025




# గుట్ట బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం: ఈఓ

**బ్రహ్మోత్సవాల బడ్జెట్ మూడు కోట్ల పైమాటే...!!**

**మార్చి 1 నుండి 11 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు**

**7న స్వామివారి ఎదుర్కోలు,**

**8న తిరుకల్యాణ మహోత్సవం**

**9న దివ్య విమాన రథోత్సవం**

**బ్రహ్మోత్సవాలు జరిగే**

**11 రోజుల పాటు ఆర్జిత సేవలు బంద్**

**మీడియా సమావేశంలో వెల్లడించిన**

**ఈవో ఏపూరి భాస్కర్ రావు.**



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లేజర్ లైటింగ్ తో వెలిగిపోతున్న యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: మార్చి ఒకటి నుండి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు షురూ కానున్నాయి. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి మూడు కోట్ల పది లక్షలుగా బడ్జెట్ ఖరారు చేసినట్లు దేవస్థానం ఈవో భాస్కర్ రావు వెల్లడించారు. గత సంవత్సరం కూడా ఇదే బడ్జెట్ తో ఉత్సవాల నిర్వహిన జరిగిందని ఆయన వివరించారు. మార్చి ఒకటి నుండి 11 వరకు.. 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. దీనికి సంబంధించిన వివరాలను ఆలయ ఈవో ఎపూరి భాస్కర్ రావు గురువారం మీడియా ప్రతినిధుల సమావేశంలో వెల్లడించారు. మార్చి 1న శనివారం విష్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం పూజలతో వార్షిక బ్రహ్మోత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. ఇక బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టాలు 7న స్వామివారి ఎదుర్కోలు, 8న తిరుకల్యాణ మహోత్సవం, 9న దివ్యవిమాన రథోత్సవం నిర్వహించనున్నారు. 11న నిర్వహించే అష్టోత్తర శతఘటాభిషేకం, శృంగార డోలోత్సవం పూజలతో బ్రహ్మోత్సవాలు ముగియను న్నాయి. ఇక బ్రహ్మోత్సవాల కారణంగా నిత్యం భక్తులచే నిర్వహింప బడే ఆర్జిత సేవలైన నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, సుదర్శన నారసింహ హోమం, బ్రహ్మోత్సవం వంటి పూజలను 11 వరకు తాత్కాలికంగా రద్దు చేశారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన అనంతరం 12 నుండి ఆర్జిత సేవలను తిరిగి పునరుద్ధరణ చేయనున్నారు.

### బ్రహ్మోత్సవాల కోసం ఏర్పాట్లు ముమ్మరం

రేపటి నుండి(శనివారం) యాదగిరిగుట్ట టెంపుల్ వార్షిక బ్రహ్మోత్సవాలు షురూ కానున్న నేపథ్యంలో.. మౌలిక సదుపాయాలు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, ఆలయాన్ని ముస్తాబు చేసే పనుల్లో ఆఫీసర్లు నిమగ్నమయ్యారు. ప్రధానాలయ ముఖ మంటపం, హనుమాన్ టెంపుల్, ఆండాళ్ అమ్మవారి ఆలయాలకు లైటింగ్ ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలను అలంకరించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అలాగే సప్తగోపుర ప్రధానాలయ సముదాయానికి ప్రత్యేక లేజర్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి యాదగిరిగుట్టకు వచ్చే ప్రధాన రహదారులతో పాటు యాదగిరిగుట్ట టౌన్ లో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. తుర్కపల్లి, రాయగిరి, వంగపల్లి, యాదగిరిపల్లిలో భక్తులకు స్వాగతం పలికేలా ఆర్చీలను ఏర్పాటు చేసి ప్రత్యేక లైటింగ్ తో అందంగా మిరుమిట్లు గొలిపేలా అలంకరించారు. మరోవైపు బ్రహ్మోత్సవాల సందర్భంగా హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని ప్రధానాలయాల నుండి యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సులను నడపడానికి ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ముఖ్యంగా మార్చి 8న రాత్రి స్వామివారి కల్యాణం సందర్భంగా.. తిరుగు ప్రయాణ భక్తుల కోసం లేట్ నైట్ వరకు బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. అదేవిధంగా



బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తున్న ఆలయ ఈవో భాస్కర్ రావు

బ్రహ్మోత్సవాలు మొదలయ్యే మార్చి ఒకటి నుండి 11 వరకు.. 11 రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు అన్ని రకాల వాహనాలను కొండపైకి ఉచితంగా అనుమతించనున్నామని ఈవో భాస్కర్ రావు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు, కళాకారులు పాల్గొనడానికి ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

### ప్రతిరోజు 2000 మందికి అన్నదానం

అన్నదానం కూడా 2000 మందికి ప్రతిరోజు చేయనున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో డిసెంబర్ నాటికి 5,000 మందికి ప్రతిరోజు అన్నదానం చేసే స్థాయికి తీసుకువెళ్లాలని కృతనిత్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు ప్రస్తుతం 1500 మందికి అన్నదానం చేస్తున్నామని ఎవరైనా భక్తులు ముందుకు వచ్చి ఒకరోజు అన్నదానం చేయాలనుకున్నప్పుడు 72,000 దేవస్థానం ఖజానాకు జమ చేసినట్లయితే వారి పేరు మీదుగా నిర్వహించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఒకరోజు ఎంతమంది భక్తులు అయినా తమ కు ఇష్టమైన తేదీల్లో అన్నదానం చేసే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. అయితే 1500 మందికి కూడా ఒక్కరు చేసే అవకాశం కూడా ఈసారి కొత్తగా ఈ స్కీమును ప్రవేశపెడుతున్నామన్నారు.




బ్రహ్మోత్సవాల కోసం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు

### మొదటి నుండి రోజునుంచే సాంస్కృతిక కార్యక్రమాలు

మొట్టమొదటిసారిగా బ్రహ్మోత్సవాలు మొదలైన మొదటి రోజు నుంచే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి భాస్కరరావు తెలిపారు. పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు చే మార్చి నెల ఒకటి నుంచి మూడో తేదీ వరకు నృసింహ వైభవం ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నారు. నాలుగున సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్ మరియు వారి బృందంచే భక్తి సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించనున్నారు. మార్చి 5న సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు ప్రముఖ తెలంగాణ జానపద సినీ నేపద్య గాయని తేలు విజయచే భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించనున్నారు. మార్చి 6న 6 గంటల నుండి 9 గంటల వరకు టీటీడీ ఆస్థాన విధ్వంసులు అన్నమాచార్య సంకీర్తన విభావరి సంగీత విద్వాంసులు అయిన గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్ చే అన్నమాచార్య సంకీర్తన విభావరి నిర్వహించడం జరుగుతుంది. మార్చి 7న సాయంత్రం 6 గంటల నుండి 9 గంటల వరకు అన్నమయ్య పదకోకిల పద్మశ్రీ డాక్టర్ శోభరాజ్ చే భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నారు. అన్నమాచార్య భావన వాహిని కళాకారులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. మార్చి 9న సాయంత్రం 6 గంటలకు 9 గంటల వరకు లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు ప్రముఖ గాయకులు సంగీత దర్శకులు కోమాండూరి రామాచార్యులు వారి బృందం ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే భక్తి సంగీత విభావరి నిర్వహించనున్నారు.

# యాదగిరిగుట్టపై వైభవంగా శివపార్వతుల రథోత్సవం





**ఘనంగా లక్షబిల్వార్చన, రథోత్సవం**

**నేడు పూర్ణాహుతితో శివరాత్రి ఉత్సవాలు**

**పరిసమాప్తి**

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట దేవస్థానానికి అనబంధ ఆలయమైన పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం లక్షబిల్వార్చన, సాయంత్రం దివ్యవిమాన రథోత్సవ వేడుకలను కన్నులపండువగా నిర్వహించారు. రథోత్సవ వేడుక కంటే ముందుగా రథం ఎదుట రథాంగ హోమాన్ని గంటపాటు సాంప్రదాయబద్ధంగా చేపట్టారు. అనంతరం శివాలయంలో నిత్య శివారాధనలు ముగిశాక పార్వతీపరమేశ్వరుల రథోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. బుధవారం రాత్రి పార్వతీదేవిని పెళ్లాడిన పరమేశ్వరుడు.. గురువారం అర్ధనారీశ్వర స్వరూపంలో దివ్యవిమాన రథంలో ఆశీనుడై ఊరేగాడు. అర్ధనారీశ్వర అలంకారంలో శివుడిని రథంలో అధిష్టింపజేసి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం కైంకర్యాన్ని ఘనంగా జరిపారు. ఈ రథోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. శివపార్వతుల రథదర్శనం ముక్తిదాయకమని అర్చకులు భక్తులకు ప్రవచించారు.

### లింగమూర్తికి ఘనంగా లక్షబిల్వార్చన

శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం శివాలయంలో నిత్య హవనాలు, శివపంచాక్షరీ జపాలు, నందీశ్వర పారాయణాలు, పంచసూక్త పఠనాలు, మూలమంత్ర జపాలతో లక్షబిల్వార్చన పూజలను స్మార్త ఆగమ శాస్త్ర పద్ధతుల్లో అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిపిన లక్షబిల్వార్చనలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రూ.516 చెల్లించి టికెట్లు విక్రయించిన భక్తులు.. శివాలయ ముఖ మంటపంలో ఉన్న స్పటిక లింగానికి లక్షబిల్వార్చన పూజలు చేశారు. ఇక ఆదివారం జరిపే మహాపూర్ణాహుతితో శివరాత్రి ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

# గుట్ట బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని రాష్ట్ర గవర్నర్‌కు ఆహ్వానం

**గవర్నర్ కు ఆశీర్వచనం జరిపిన అర్చకులు**

**ఆహ్వాన లేఖను అందజేసిన ఈవో యెపూరి భాస్కర్ రావు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పలుకుతూ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు దేవస్థానం ఆలయ అధికారులు ఆహ్వాన లేఖను అందజేశారు. గురువారం రాజ్ భవన్ కు దేవస్థానం కార్యనిర్వహణాధికారి, అడిషనల్ కలెక్టర్ ఏపూరి భాస్కరరావు ఆధ్వర్యంలోని అర్చక బృందం గవర్నర్ ను కలిసి మొదటగా ఆశీర్వచనం జరిపారు. శ్రీవారి ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని అందజేశారు. అనంతరం మార్చి ఒకటి నుంచి 11వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలలో పాల్గొనాల్సిందిగా కోరుతూ ఆయనకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన లేఖను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దోర్భల భాస్కర శర్మ, దేవస్థానం ఉప ప్రధానార్చకులు బట్టర్ సురేంద్ర చార్యులు, కిరణాచార్యులు, ప్రోటోకాల్ ఇన్చార్జి రాజన్ బాబు, ఈఓ సీసీ వినోద్ లు ఉన్నారు.

